క్లుప్తంగా

బోనం.. ఘనం



బోనాలతో పోచమ్మ ఆలయానికి వస్తున్న మహిళలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ముత్తన్నపేట గ్రామస్తులు నిర్వహించే బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలలో భాగంగా శుక్రవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నీలం మధు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లిలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు, ముదిరాజ్ కులస్తులు అంగరవైభవంగా నిర్వహించారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. ఆయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజయ్య, నాయకులు మల్లేశ్, సురేందర్, శ్రీనివాస్, వేణు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా చక్రధర్



మద్దూరు(హుస్నాబాద్): స్థాని ఎస్సీ బాలురు హాస్టల్ వార్డెన్‌గా ముత్యాల చక్రధర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ హాస్టల్‌లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్లు ఉన్నాయని, సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



వంగరామయ్యపల్లిలో లబ్ధిదారులకు మార్కింగ్ ఇస్తున్న ఏఈ భవాని

హుస్నాబాద్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా పూర్తిచేసుకుంటే బిల్లులు చెల్లిస్తామని హౌసింగ్ ఏఈ భవాని చెప్పారు. శుక్రవారం ఆమె వంగరామయ్యపల్లిలో పర్యటించి లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇంటిని నిర్మించుకోవాలని, 600 ఫీట్లు దాటితే బిల్లులు నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తిచేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకితోపాటు మండలంలోని వడ్లూరు, లక్ష్మీపూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ ఏఈ రవళి పరిశీలించారు. త్వరితగతిన తమ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమాలలో నాయకులు, రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శులు ప్రణీత్‌రెడ్డి, అనూష తదితరులు పాల్గొన్నారు.

యోగా డేకు ఆహ్వానం



సీపీ అనురాధను ఆహ్వానిస్తున్న అధికారులు

సిద్దిపేటకమాన్: అంతర్జాతీయ యోగా డే సందర్భంగా జూన్ 21న సిద్దిపేట బాలికల హైస్కూల్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయుష్ డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధకు ఆహ్వాన పత్రాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో అధికారులు అనిల్, అజీమ్, యోగా టీచర్ నర్మద, పూజిత, రేవతి, సురేశ్, మనోహర్, శ్రీనివాస్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ బడే ముద్దు

- గ్రామాల్లో జోరుగా బడిబాట
- ఉపాధ్యాయుల ప్రచారం



గౌరవెల్లి గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న జానపద గాయని కనకవ్వ

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని ఉన్నత విద్యార్హతలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని ప్రముఖ జానపద గాయని గొట్టె కనకవ్వ పాటపాడి అవగాహన కల్పించారు. మండలంలోని గౌరవెల్లి గ్రామంలో ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గాయని కనకవ్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. దాస్‌తండా, కట్కూర్ గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన డబ్బులను ప్రైవేటు విద్యా సంస్థలకు వృథాచేయవద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, శంకర్‌నాయక్, రమణబాబు, చంద్రారెడ్డి, శ్రీనివాస్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఉపాధ్యాయులు అన్నారు. బెజుగామ గ్రామంలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, బాలమణి, శంకరయ్య, జ్యోతి, కనకరాజు, అంగన్‌వాడీ టీచర్లు సునీత, పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తులు భాగం కావాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి గ్రామస్తులను భాగస్వామ్యం చేయాలని ఎంఈఓ ప్రవీణ్‌బాబు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రామసభ నిర్వహించారు.

ప్రారంభమైన బడిబాట

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కౌన్సిలర్‌లు, ఎస్ఎంసీ సభ్యులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ, డిజిటల్ తరగతులు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ బడులకే పంపించాలని కోరారు.



సిద్దిపేటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, నేతలు

బలోపేతం చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమాలలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బెజ్జంకిలో హెచ్‌ఎం శ్రీరాములు తదితరులు

బడికి పంపించండి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ తమ పిల్లలను బడికి పంపించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో లభించే వసతులు, పథకాల గురించి తెలియజేశారు. హెచ్‌ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు సురేశ్, యాదయ్య, లలిత, సునీత, నాగమణి, వాణి తదితరులు పాల్గొన్నారు.



రామంచలో బడిబాట కార్యక్రమం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి విధిగా ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మాస్టర్ రాజలింగం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బడిబాట తర్వాతే సర్దుబాటు ప్రారంభించండి

టీఎస్ యూటీఎఫ్ నాయకుల వినతి



డీఈఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బడిబాట కార్యక్రమం తర్వాతే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట యాదగిరి కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకవైపు విద్యార్థుల నమోదు పెంచాలంటూ మరో వైపు ఉపాధ్యాయ సర్దుబాటును 13లోగా ముగించాలని ఉత్తర్వులు జారీ చేయడం సరైనది కాదన్నారు. బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదనా, పెరిగిన సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే న్యాయబద్ధంగా ఉంటుందని సూచించారు. అందువల్ల ఉపాధ్యాయుల సర్దుబాటును ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు నాలుగు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. వారి వేతనాలకు సంబంధించిన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివలింగం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఆలయాలకు సహకారం



రామంచలో ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న హరీశ్‌రావు

ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): అన్ని దేవాలయాలకు తన సహకారం ఉంటుందని, పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో అన్నింటా శుభం కలగాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మండల పరిధిలోని రామంచలో శుక్రవారం పెద్దమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే గోనెపల్లిలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆదర్శంగా రూ.5 కోట్లతో సిద్దిపేటలో ముదిరాజ్ భవనం నిర్మించుకున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించామని, ప్రస్తుతం వారికి ఉపాధి లేకుండా పోయిందని వాపోయారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, నాయకులు పాపయ్య, కనకరాజు, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, ఎల్లాగౌడ్, కమలాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

షార్టుకట్ సంపాదన వద్దు

నంగునూరు(సిద్దిపేట): ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ యువత షార్ట్‌కట్ సంపాదనకు అలవాటు పడుతున్నారని, అది సరికాదని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ తన తల్లిదండ్రులు మహమ్మద్ పలేస్సెన్, మహమూద్ చాను జ్ఞాపకార్థం పిట్టల గుడిసెలు కాలనీకి శుక్రవారం రూ.2 లక్షల విలువ చేసే వంట సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారుఖ్‌హుస్సేన్‌ను స్ఫూర్తిగా తీసుకొని తల్లిదండ్రులకు సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఉమ, మాజీ సర్పంచ్ భిక్షపతి నాయక్, మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, మహిపాల్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, లింగం గౌడ్, కృషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): త్యాగానికి, ఐక్యతకు బక్రీద్ ప్రతీక అని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఈద్ అల్– అదా (బక్రీద్) పండుగ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దయతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: హుస్నాబాద్ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో (అక్కన్నపేట)ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.మమత ఒక ప్రకటనలో కోరారు. ఎంపీసీలో ఎస్టీ కేటగిరిలో 25, బైపీసీలో ఎస్టీ కేటగిరిలో 15 సీట్లు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు 16న సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరు కావాలని కోరారు. వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

పుస్తె, మట్టెలు అందజేత



పుసె అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: నిరుపేద వధువు వివాహం సందర్భంగా గజ్వేల్‌కు చెందిన గోలి సంతోష్ సహకారంతో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పుస్తెమట్టెలను శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీకి చెందిన వధువుకు సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నవాజ్‌మీరా, కనకయ్య, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.14,500 జరిమానా, వారిలో ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

దరఖాస్తు ఫారాలు కరువు

కొమురవెల్లి(సిద్దిపేట): తహసీల్దార్ దివ్య రెవెన్యూ సదస్సులను కాంగ్రెస్ పార్టీ సదస్సులుగా మార్చినట్లు సీపీఎం మండల నాయకులు తేలు ఇస్తారి ఆరోపించారు. మండలంలోని అయినాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. తమ సమస్యలను విన్నవించేందుకు దరఖాస్తు ఫారాలను అందివచడం లేదని వాపోయారు.

పోచమ్మతల్లీ.. చల్లంగా చూడమ్మా..

ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

దుబ్బాక: ముత్యాల పోచమ్మ తల్లి అందరినీ చల్లంగా చూడాలంటు వేడుకున్నట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. పట్టణంలో బాబుజగ్జీవన్ రామ్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ముత్యాల పోచమ్మతల్లి ఉత్సవాల్లో శుక్రవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అమ్మవారి దయతో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటారన్నారు. అనంతరం గ్రామస్తులు వారిని ఘనంగా సన్మానించారు.



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య

నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

ట్రాఫిక్ సీఐ మురళి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ట్రాఫిక్ సీఐ మురళి పిలుపునిచ్చారు. పట్టణంలోని రైల్వేబ్రిడ్జి కింద శుక్రవారం పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతుందని, ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్, మితిమీరిన వేగం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్ఐ జగదీశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

తున్కిఖాల్సాలో కళాజాత

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు, నకిలీ విత్తనాలు, సామాజిక రుగ్మతలపై గురువారం రాత్రి వర్గల్ మండలం తున్కిఖాల్సాలో పోలీసు కళాబృందం 'కనువిప్పు' కార్యక్రమం నిర్వహించింది. బాలు, రాజు, తిరుమల, శ్యాంసుందర్, ప్రసాద్, కనకయ్య, భిక్షపతి సామాజిక రుగ్మతలు తదితర అంశాలపై నాటకం, పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు అధికారులు సూచించిన విత్తనాలు, పురుగు మందులనే వాడాలన్నారు. గంజాయి తదితర మత్తుపదార్థాలు, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.



గజ్వేల్ రైల్వేబ్రిడ్జి కింద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆరుసార్లు వేలిముద్రలతో ఇబ్బందులు

చేర్యాల(సిద్దిపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పంపిణీ విషయంలో ఒక్కో లబ్ధిదారుడు ఆరుసార్లు వేలి ముద్రలు వేయడంతో ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని శభాష్‌గూడెంలో దాసరి కనకయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగిన గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా ఒకేసారి మూడు నెలల రేషన్ ఇవ్వడం, అందుకు ఆరుసార్లు వేలి ముద్రలు వేయాల్సి రావడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బియ్యం కోసం ఇళ్లు, పనులు వదులుకుని రాత్రి 9గంటల వరకు రేషన్ షాపులు వద్ద పడిగాపులు కాయాల్సివస్తుందని వాపోయారు. దీనిపై ప్రభుత్వాలు స్పందించి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కనకయ్య, రమేశ్, బాలు, కనకయ్య, సంపత్, నగేశ్, ప్రకాశ్, సురేశ్, కొమురయ్య, కృష్ణ, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్‌గౌడ్

మానవ అక్రమ రవాణాను అడ్డుకుందాం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ, పోలీస్‌శాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

ముగిసిన శిక్షణ కార్యక్రమం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మానవ అక్రమ రవాణాను నిరోధించడం మనందరి బాధ్యత అని విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి రంగనాథ్ అన్నారు. స్థానిక నూతన ఉన్నత పాఠశాలలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతి గ్రామంలోను కమ్యూనిటీ విజిలెంట్ గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అక్రమరవాణాపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ, పోలీస్‌శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి ప్రధాని నరేంద్రమోదీ

బీజేపీ రాష్ట్ర నాయకుడు దశమంతరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతు పక్షపాతి అని బీజేపీ రాష్ట్ర నాయకుడు అరుట్ల దశమంతరెడ్డి అన్నారు. మండలంలోని అయినాపూర్ గ్రామంలో మండల అధ్యక్షురాలు బుర్గోజు స్వరూప అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల కార్యశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనలో సుమారు 17 కోట్ల మంది పేదలను దారిద్ర్యరేఖకు ఎగువకు తీసుకువచ్చారన్నారు. ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని విశ్వగురువుగా నిలుపాలన్న మోదీ ఆశయం త్వరలోనే నెరవేరుందని చెప్పారు. 2014 నుంచి ఇప్పటి వరకు అన్ని రకాల పంటల కనీస మద్దతు ధరను భారీగా పెంచినట్లు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు ప్రచారం చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, ప్రకాశ్, భిక్షపతి, శివారెడ్డి, భిక్షపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దశమంతరెడ్డి

ప్రశ్నించే బాధ్యత పౌరసమాజానిదే

కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్

జగదేవ్‌పూర్(గజ్వేల్): పౌరసమాజం ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని కేంద్ర సమాచార మాజీ కమిషనర్, నల్సార్ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ 25 యేళ్ల రజోత్సవం సందర్భంగా జగదేవ్‌పూర్‌లో కేశిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి గార్డెన్స్‌లో జర్నలిజం.. విలువలు..పౌరసమాజం పాత్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఒక ప్రశ్న కోట్లాది మందిని ఆలోచింపజేస్తుందన్నారు. అనంతరం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ అనేక మంది అభాగ్యులకు అండగా గజ్వేల్ ప్రెస్‌క్లబ్ నిలిచిందని, గొంతు లేని ప్రజలకు గొంతుకగా నిలిచిందన్నారు. అంతకు ముందు జగదేవ్‌పూర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, కార్యదర్శి అరుణ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ వైస్ మాజీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాలేషంగౌడ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సభ్యులు సురేందర్, మధుసూదన్‌రెడ్డి, యాదగిరి, నర్సింహులు, కిరణ్, కృష్ణ, శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ రఘువీరారెడ్డి, ఎంపీడీఓ రాంరెడ్డి, ఏపీఓ కిరణ్, ఎస్ఐ చంద్రమోహన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భవాని, రజిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర సమాచార మాజీ కమిషనర్ శ్రీధర్